క్లుప్తంగా

గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలు



నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యాపేట అర్బన్ : మాజీ ఎంపీ గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలను జిల్లా విద్యుత్ కార్యాలయంలో ఆదివారం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గడ్డం వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నేతకాని వెంకన్న, విద్యుత్ అధికారులు, విద్యుత్ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బస్సు నడిపించాలి

అర్వపల్లి : అర్వపల్లి నుంచి ఉదయం వేళలో మాత్రమే హైదరాబాద్‌కు బస్సులు నడుస్తున్నాయని, సాయంత్రం వేళలో కూడా ఒక బస్సును హైదరాబాద్‌కు నడిపించాలని సీపీఎం డివిజన్ సీనియర్ నాయకుడు కొప్పోజు యాదగిరి ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రాంతం నుంచి సాయంత్రం వేళలో కూడా అనేకమంది హైదరాబాద్‌కు వెళ్తుంటారని అన్నారు. ఆర్టీసీ అధికారులు సర్వే చేసి సాయంత్రం వేళలో బస్సును హైదరాబాద్‌కు నడిపించాలని విజ్ఞప్తిచేశారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

నూతనకల్ : నూతనకల్ మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కూసు నాగరాజు ఇటీవల మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులకు ఆదివారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రూ.20వేల ఆర్థిక సహకారం అందజేశారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పంతం వెంకన్న, పులుసు రవి, తునికి వినయ్, గునగంటి లింగయ్య, ఇరుగు రమేష్, బత్తుల రవి, పులుసు అశోక్, మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం పాటుపడాలి



బైక్ యాత్ర నిర్వహిస్తున్న ప్రభాకర్

నూతనకల్ : డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని సామాజిక కార్యకర్త, ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జనచైతన్య బైక్ యాత్రలో భాగంగా ఆదివారం మిర్యాల గ్రామంలోని వారసంతలో ప్రజలకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత మత్తుపదార్థాలకు అలవాటు కావడం వల్ల ఆరోగ్యం చెడిపోవడంతోపాటు భవిష్యత్తు ఆగమవుతుందని అన్నారు. దసరా సెలవుల్లో వివిధ జిల్లాల్లో బైక్ ద్వారా 2300 కిలో మీటర్లు పర్యటించి ప్రజలకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై వివరించినట్లు తెలిపారు.

జిల్లా పాస్టర్స్ సమావేశం

హుజూర్‌నగర్ : జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ సభ్యుల సమావేశం ఆదివారం పట్టణంలోని న్యూ లైఫ్ చర్చిలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ మైనార్టీ అడ్వైజర్ విజయకుమార్ విల్సన్ బిషప్ సమక్షంలో పాస్టర్ గడ్డం డేవిడ్ రాజును బిషప్‌గా అభిషేకించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గ నాయకులు సామియేలు, ఝోషయా, సుధాకర్, మేడి పాల్, రవికాంత్, దేవదానం, అమోస్, పలువురు పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

అన్ని స్థానాల్లో పోటీ

నడిగూడెం : సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీజేపీ పోటీ చేయనున్నట్లు ఆ పార్టీ నల్లగొండ పార్లమెంట్ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల మానిటరింగ్ కమిటీ చైర్మన్, జిల్లా మన్‌కీ బాత్ ప్రోగ్రాం కన్వీనర్ వంగవీటి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గ్రామంలో లబ్ధి పొందుతున్నారన్నారు. రెండేళ్లుగా గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయకపోవడంతో నిర్వహణ కష్టంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతోనే ఎన్నికలకు ప్రజల్లోకి వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు.

దూరభారం.. తప్పని ఇబ్బందులు

- రేషన్ కోసం తిమ్మాపురం పరిధిలోని కాలనీలవాసులకు తిప్పలు
- ప్రతి నెలా బియ్యం తీసుకునేందుకు 3కి.మీ వెళ్లాల్సిన దుస్థితి
- కాలనీలకు అందుబాటులో మరో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని స్థానికుల వేడుకోలు



రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు(ఫైల్)

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామంతో పాటు జ్యోతులనగర్, తిమ్మాపురం క్రాస్‌రోడ్డు, జంగాలకాలనీలు ఉన్నాయి. అయితే గ్రామంలో రెండు రేషన్ దుకాణాలు ఉండగా జ్యోతులనగర్, తిమ్మాపురం క్రాస్‌రోడ్డు ప్రజలు రెండున్నర నుంచి 3 కి.మీ నడిచి వెళ్లి ప్రతినెలా రేషన్ సరుకులు తెచ్చుకుంటున్నారు. దీంతో ప్రజలు ఎన్నో వ్యయప్రయాసలకు లోనవుతున్నారు. అయితే తిమ్మాపురం క్రాస్‌రోడ్డు లేదా జ్యోతులనగర్‌లో రేషన్‌దుకాణం ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

ఆ రెండు ఆవాసాల్లో 500 కార్డులు..

తిమ్మాపురం గ్రామంలో మొత్తం 1,200 పాత రేషన్ కార్డులుండగా కొత్తగా మరో 200కుపైగానే కార్డులు జారీ అయ్యాయి. వీటిలో 500కార్డులకు పైగానే జ్యోతులనగర్, తిమ్మాపురం క్రాస్‌రోడ్డు, జంగాలకాలనీ వాసులవి ఉన్నాయి. వీరంతా ప్రతినెలా గ్రామానికి వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నారు. అదనంగా ఆవాస కాలనీలలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని లేదా గ్రామంలోని ఒక దుకాణాన్ని ఆవాసాలకు మార్చాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే అనేకమార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. ఆందోళన కార్యక్రమాలు కూడా చేపట్టారు. ఇప్పటికైనా దుకాణం ఏర్పాటు చేసి తమకష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి



తిమ్మాపురంక్రాస్ రోడ్డు వద్ద అదనంగా రేషన్ దుకాణం ఏర్పాటు చేస్తే మూడు ఆవాస గ్రామాలకు అనుకూలంగా ఉంటుంది. రేషన్‌దుకాణం ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా అధికారులకు మొరపెట్టుకుంటున్నాం. ఇప్పటికైనా రేషన్ దుకాణం ఏర్పాటు చేసి, సమస్య పరిష్కరించాలి.

– ఎడ్ల సంతోష్, తిమ్మాపురం క్రాస్‌రోడ్డు

3 కి.మీ వెళ్లాల్సి వస్తుంది



జ్యోతులనగర్ నుంచి తిమ్మాపురం గ్రామానికి 3 కి.మీ నడిచివెళ్లి ప్రతినెలా రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సి వస్తుంది. దీంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. వృద్ధులైతే కొన్ని సార్లు సరుకులు తెచ్చుకోలేక మానేస్తున్నారు. ఇప్పటికైనా కొత్త దుకాణం ఏర్పాటు చేయాలి.

– పేరెల్లి గోవర్ధన్, జ్యోతులనగర్

సొంత భవనాలు నిర్మించరూ..

- అద్దె గదుల్లో గ్రామ పంచాయతీల సేవలు
- సౌకర్యాలు లేక ఇబ్బందులు



జగనాతండా పాఠశాలలోని గదిలో కొనసాగుతున్న గ్రామ పంచాయతీ కార్యాలయం

చివ్వెంల : గ్రామ పాలన ప్రజలకు మరింత చేరువ చేసేందుకు గత ప్రభుత్వం కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసింది. మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉండగా కొత్తగా మరో 16 గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయగా, నేడు వాటి సంఖ్య 32కు చేరుకుంది. ఉండ్రుగొండ, గుంపుల, మోదిన్‌పురం, రాజుతండా, గుర్రతండా, ఎంజీ నగర్ తండా, జగనాతండా, మొగ్గయ్యగూడెం, భీమ్లాతండా, పులితండా, సేవాలాల్‌తండా, పిల్లల జెగ్గుతండా, బద్యాతండా, జయరాంగుడితండా, ఎర్ర సూర్యాతండా, అక్కలదేవిగూడెం గ్రామాలను నూతనంగా పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. కానీ ఏడు సంవత్సరాలు గడుస్తున్నా నూతన పంచాయతీల్లో సౌకర్యాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. మండలంలో ఏర్పాటైన నూతన పంచాయతీలకు నేటికీ సొంత భవనాలు నిర్మించలేదు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర భవనాల్లో పంచాయతీ కార్యాలయాలు నిర్వహిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. మండలంలోని అన్ని పంచాయతీలకు పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. కానీ సౌకర్యాలు లేకపోవడంతో పాలనాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా ఆయా గ్రామాలకు నూతన గ్రామ పంచాయతీ భవనాలను మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

తెలంగాణ ఉద్యమకారుడికి ఎమ్మెల్యే నివాళి



అర్వపల్లిలో కృష్ణమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్, తదితరులు

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ దిర్శనపు కృష్ణమూర్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆదివారం అర్వపల్లిలో నిర్వహించిన ఆయన సంతాప కార్యక్రమంలో ఎమ్మెల్యే సామేల్ పాల్గొని నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో డీసీసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు చెవిటి వెంకన్నయాదవ్, దరూరి యోగానందచారి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మొరపాక సత్యం, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, శిగ నసీర్ గౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుడిపల్లి మధుకర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అవిలయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ వెంకన్న, ఏఎంసీ డైరెక్టర్ బైరబోయిన సైదులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, దబ్బేటి యాదగిరి, తెంగాణ ఉద్యమకారులు లింగంపల్లి రమణ, దడిపల్లి వెంకట్, పంది యాదగిరి, అలువాల వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ఆత్మకూర్ జెడ్పీహెచ్ఎస్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రంలోని జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాల 1999–2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు రాంరెడ్డి, తంగెళ్ల వీరారెడ్డి, తంగెళ్ల పెద వీరారెడ్డి, కాసర్ల వీరారెడ్డి, శంకర్‌నాయక్, చల్లా సత్యనారాయణ, సోమయ్య, సుధాకర్ రెడ్డి, యాదయ్యలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మధు, రవి, సుచరిత, పార్వతమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓరుగంటి శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు కష్టపడాలి

చిలుకూరు : సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ మండల ఎన్నికల కన్వీనర్ తిపిరిశెట్టి బసవయ్య అన్నారు. ఆదివారం చిలుకూరులో నిర్వహించిన ఆ పార్టీ మండల సమావేశంలో మాట్లాడారు. జెడ్పీటీసీకు పోటీ చేసే అభ్యర్థుల వద్ద నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు ఓరుగంటి కిట్టు, మండల పార్టీ అధ్యక్షుడు పొరెల్లి మహేష్, జిల్లా, మండల నాయకులు బత్తిని శ్రీనివాస్, మోదుగు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీను, రామినేని నరసింహారావు, అనిల్, సతీష్, సుదర్శన్, భూషయ్య, కట్టికోల వెంకన్న, మోదుగు కృష్ణారెడ్డి, సురేష్, మహేష్, పాండు నాయక్, రవి, ఎల్లయ్య పాల్గొన్నారు.

ముగిసిన సెలవులు.. ప్రయాణికుల రద్దీ



అర్వపల్లిలో ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న జనం

అర్వపల్లి : దసరా సెలవులు ముగియడంతో పల్లెల నుంచి జనం మళ్లీ పట్టణాల బాట పట్టారు. దసరా సెలవులకు స్వగ్రామాలకు వచ్చిన వారు తిరిగి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం అర్వపల్లిలో ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు ప్రయాణికులతో కిటకిటలాడాయి.

శునకాల గుంపు.. జనాల్లో వణుకు

- గ్రామాల్లో పెరుగుతున్న కుక్కల బెడద
- భయాందోళన చెందుతున్న ప్రజలు



తిరుమలగిరిలో గుంపులుగా ఉన్న కుక్కలు

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ తోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి కాలు బయట పెట్టాలంటే జంకుతున్నారు. గ్రామాల్లో కుక్క కాటు బాధితులు రోజురోజుకూ పెరుగుతున్నారు. చిన్న పిల్లలను పాఠశాలలకు తీసుకెళ్లాలంటే ఎక్కడి నుంచి కుక్కలు వచ్చి దాడులు చేస్తాయోనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన, అంతర్గత రోడ్ల వెంట వెళ్లే బాటసారులు, వాహనదారులను కుక్కలు వెంబడిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. ముఖ్యంగా సాయంత్రం, రాత్రి వేళల్లో కుక్కలు కాలనీలలో గుంపులు, గుంపులుగా సంచరిస్తూ పెద్ద ఎత్తున మొరుగుతుండటంతో నిద్ర లేని రాత్రులు గడుపుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడదను నియంత్రించాలని, కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

వీధి కుక్కలతో భయమేస్తోంది

వీధి కుక్కల భయానికి కాలు బయట పెట్టడానికి జంకుతున్నాం. వీధుల్లో కుక్కలు పెద్ద ఎత్తున గుంపులుగా తిరుగుతున్నాయి. చిన్న పిల్లలు స్కూల్‌కు వెళ్తున్నప్పుడు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నాం. వాహనాల మీద వెళ్తుంటే కూడా కుక్కలు వెంబడిస్తున్నాయి. కుక్కల బెడద లేకుండా చూడాలి.

– శ్రీనివాస్, తిరుమలగిరి

కుక్కల బెడద నుంచి కాపాడాలి

గ్రామంలో కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతున్నాయి. దీంతో వీధుల్లోకి వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తోంది. ముఖ్యంగా పిల్లలను బయటకు పంపాలంటే భయపడుతున్నాం. కొన్నిసార్లు ఇళ్లల్లో ఉన్న పశువుల మీదకు వచ్చి కూడా కుక్కలు గాయపరుస్తున్నాయి. అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలి.

– యాకన్న, తొండ

అభ్యర్థులను గెలిపించండి

నడిగూడెం : సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని బృందావనపురంలో నిర్వహించిన ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌ల బరిలో బృందావనపురం, కరివిరాల, కాగితరామచంద్రాపురం, వల్లాపురం, రత్నవరం, రామాపురం, సిరిపురం ఎంపీటీసీ స్థానాలతో పాటు, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో తమ అభ్యర్థులను నిలబెట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ వైస్‌ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్, బృందావనపురం మాజీ సర్పంచ్ బెల్లంకొండ హనుమయ్య, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాసాని కిషోర్, చాపల బిక్షం, బొడ్డు వెంకటనారాయణ, ముసుకు వీరస్వామి, సత్యనారాయణ, చందర్‌రావు, రాంబాబు, జమ్మి యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మునగాల : మండలంలోని నరసింహులగూడెంలో బీఆర్ఎస్ గ్రామశాఖ నాయకులు షేక్ బాలసైదా మృతి పార్టీకి తీరనిలోటని గ్రామశాఖ అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. బాలసైదా ఇటీవల అనారోగ్యానికి గురై మృతిచెందంతో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ సహకారంతో బాధిత కుటుంబానికి రూ.35,500 ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. అనంతరం నాగుల్‌మీరా మాట్లాడుతూ బాలసైదా కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ప్రమీల, నాయకులు మంగయ్య, లక్ష్మీనారాయణ, సుధాకర్‌రెడ్డి, హనుమయ్య, కోటేష్, శ్రీనివాస్, రాంబాబు, వెంకటేశ్వర్లు, నవీన్, లింగస్వామి, నగేష్, గోపిరెడ్డి, సందీప్, హరీష్, సతీష్, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మఠంపల్లి : మండల కేంద్రమైన మఠంపల్లిలోని వీవీ హైస్కూల్‌లో 30ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న బాల్యస్నేహితుడు అక్కినేపల్లి నరసింహచారి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం ఈ విషయం తెలుసుకున్న స్థానిక స్నేహితుడు, కళాకారుడు, స్పందన సాహిత్యకళావేదిక అధ్యక్షుడు కర్ల శ్రీనివాస్ బాల్య స్నేహితుడు నరసింహాచారి ఇంటికి వెళ్లి రూ.5వేలు ఆర్థిక సాయం అందించాడు. దీంతో బాధితుడి కుటుంబ సభ్యులతోపాటు బాల్య స్నేహితులు శ్రీనివాస్‌ను అభినందించారు. .

మాజీ మంత్రి దామోదర్ రెడ్డికి ఘన నివాళి



చివ్వెంల : వల్లభాపురంలో ఆర్డీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

చివ్వెంల : చివ్వెంల మండల పరిధిలోని వల్లభాపురంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మోగాదాల లక్ష్మణ్‌గౌడ్, కుంభం లక్ష్మయ్య, మోగాదాల లింగయ్య, మోగాదాల వెంకన్న, భూతం కర్ణాకర్, భూతం నర్సయ్య, సైదులు, అంజనేయులు, నాగరాజు, శ్రీనివాస్, అజ్జు, సాగర్, రామరాజు, పరశురాములు, సందీప్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాత శోభాయాత్ర



తిరుమలగిరిలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

తిరుమలగిరి : తిరుమలగిరిలో ఆదివారం దుర్గామాత శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపం వద్ద అమ్మవారికి పూజలు నిర్వహించి, అనంతరం విగ్రహాన్ని భారీ ఊరేగింపుగా తీసుకెళ్లి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు.

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి



మాట్లాడుతున్న ముస్కు శ్రీనివాసరెడ్డి

అనంతగిరి : సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పాలారంలో ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో పాలారం ఎంపీటీసీ అభ్యర్థిగా తేజావత్ వీరన్నను ఎంపిక చేసినట్లు తెలిపారు. అనంతరం ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మట్టపల్లి రామకోటయ్య గౌడ్, మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు, ముస్కు మధుసూధన్‌రెడ్డి, హట్యానాయక్, మాదాసు బిక్షం, కుమ్మరి గురవయ్య, ఎస్‌డీ సైదా, షరీఫ్, ఎస్‌డీ హుస్సేన్, పరశురాములు, మొక్క కాశయ్య, రమేష్, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తితో భగవంతుడిని ప్రార్థించాలి



భగవద్గీత ప్రచారకులు ప్రభూజీ హిషికేశ దాస్, దాతలను సన్మానిస్తున్న సత్సంగ్ నిర్వాహకులు

హుజూర్‌నగర్ : భగవంతుడిని సంతృప్తి పరిచే మార్గం భక్తి మాత్రమే అని ఇస్కాన్ టెంపుల్ (హైదరాబాద్) భగవద్గీత ప్రచారకులు ప్రభూజీ హిషికేశ దాస్ అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో భగవద్గీత సత్సంగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన భవద్గీత తొమ్మిదో అధ్యాయంపై ప్రసంగించారు. భగవంతుడిని సంతృప్తి పరచడం కేవలం భక్తి వల్లనే సాధ్యం అవుతుందని చెప్పారు. భగవంతుడికి ప్రేమతో, భక్తితో ఓ పత్రం, ఓ పుష్పం, ఓ ఫలం సమర్పించినా సరే సంతృప్తి చెందుతారని తెలిపారు. భగవంతుడితో పాటు ప్రతి ఒక్కరిపై ప్రేమ, ఆప్యాయత కలిగి ఉండాలని, ఇతరులకు సాయం చేసే గుణం కలిగి ఉండాలన్నారు. తొలుత ప్రభూజీ హిషికేశ దాస్, స్టేజీ, ప్రసాద వితరణ దాత గుండా జ్యోతి శ్రీనివాస్, కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మట్టపల్లి శ్రీమన్నారాయణ, ఆత్కూర్ ఆంజనేయులు, బొగ్గవరపు రాధ, పెండ్యాల నాని, ఉప్పేపల్లి చంద్రం, సతీష్, కొత్త శ్రీను, బూరుగు శ్రీను, వెంకటలక్ష్మి, పాండు, ఏలూరు రాంబాబు, చిల్లంచర్ల ఆనంద్, జూలకంటి ఉపేందర్, మట్టపల్లి సత్యనారాయణ, పలువురు మహిళలు పాల్గొన్నారు.

ఆశయ సాధనకు కృషి చేయాలి

గరిడేపల్లి : ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు పొరెల్లి లక్ష్మి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కోటేశ్వర్‌రావులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో పొరెల్లి సునీత అధ్యక్షతన నిర్వహించిన సభలో వారు పాల్గొని మాట్లాడారు. పొరెల్లి లక్ష్మి గ్రామంలో పార్టీ కార్యకర్తగా, మహిళా సంఘం నాయకురాలుగా చురుకైన పాత్ర పోషించిందన్నారు. సమాజ మార్పు కోసం నిర్వహించే ఉద్యమాల్లో తాను సైతం అంటూ తన వంతు పాత్రను నిర్వర్తించిందని తెలిపారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజా చైతన్య వేదిక కన్వీనర్ రాయపూడి చిన్ని, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య, అరుణోదయ జిల్లా అధ్యక్షులు ఉదయగిరి, పొరెల్లి నాగయ్య, నరసింహారావు, పోటు దుర్గారావు, వెంకటేశ్వరరావు, సంతోష, లక్ష్మి, మల్లయ్య, కనకరావు, అబ్రహం, రవి, గోపాల్‌రావు, అర్జున్‌రావు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తుకు సిద్ధం



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు కృష్ణారెడ్డి

అనంతగిరి : సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తమతో కలిసి వస్తే పొత్తుకు సిద్ధమని, లేదంటే ఒంటరి పోరుకు సిద్ధమని సీపీఐ నాయకులు స్పష్టం చేశారు. అనంతగిరి మండల పరిధిలోని శాంతినగర్‌లో మండల కౌన్సిల్, శాంతినగర్ గ్రామ శాఖల ఆధ్వర్యంలో ఆ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బద్దం కృష్ణారెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న శాఖలో కాంగ్రెస్ పార్టీతో అభ్యర్థుల ఖరారుపై చర్చిస్తామని, చర్చలు సఫలీకృతం కాకపోతే ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో శాంతినగర్, లకారం, బొజ్జగూడెంతండా, అనంతగిరి మొగలాయికోటలలో పొత్తు లేకపోయిన ఒంటరిగా పోటీకి తీర్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి యరసాని రవి, డేగ వీరన్న, నీలం నాగభద్రం, వాక పుల్లారెడ్డి, బత్తిని వీరబాబు, షేక్‌లాలు, కౌన్సిల్ సభ్యులు, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డుకు ఎంపిక

గరిడేపల్లి : ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని గడ్డిపల్లి ఆదర్శ పాఠశాలకు చెందిన జె. ప్రసన్నకుమారిని గ్లోబల్ జ్ఞాన్ అకాడమీ కడప ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేశారు. ఆదివారం ఆ అవార్డును ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1390 మంది దరఖాస్తుల నుంచి 20మంది ఉపాధ్యాయులను తుది జాబితాకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వారిలో జ్యూరీ ఎంపిక చేసిన టాప్10 ఉత్తమ ఉపాధ్యాయులలో తను ఉన్నట్లు తెలిపారు.